ప్రభుత్వ నిర్ణయం దారుణం



టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీపీ విధానం దారుణంగా ఉంది. దీని వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుంది. పేద విద్యార్థులు కూడా డాక్టర్లు కావాలనే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మెడికల్ సీట్లను ప్రైవేట్ పరం చేస్తుండడం దారుణం. ఇకనైనా కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు అన్యాయం జరిగే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

–రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి



పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు



మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడం వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. ప్రభుత్వ కాలేజీల్లో తక్కువ ఫీజుతోనే వైద్య విద్యను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అదే ప్రైవేట్ పరం చేస్తే విద్యార్థులపై ఫీజుల భారం పడుతుంది. ఫలితంగా పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కళాశాలలను త్వరితగతిన పూర్తి చేసి ఎంబీబీఎస్ సీట్లు తెచ్చేలా చొరవ తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల వైద్య విద్య వ్యాపారంగా మారే ప్రమాదముంది.

–అల్తాఫ్ బాషా, ఏఐఎస్ఎఫ్ నాయకుడు

క్లుప్తంగా

కష్టజీవుల ఆశా జ్యోతి సీతారాం ఏచూరి

కల్లూరు: కార్మిక, కష్టజీవుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని సీఐటీయూ నాయకులు సుధాకరప్ప, రామాంజనేయులు, యేసు అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనతరం సీతారాం ఏచూరికి రెడ్ సెల్యూట్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, శ్రీను, అయ్యన్న, శ్రీనివాసులు, దాసు, కిషోర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

సి.బెళగల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ – 2 ఆదామ్‌బాషా తెలిపారు. వివిధ పాఠశాలల్లో కుక్ కమ్ హెల్పర్లుగా (సీసీహెచ్‌లు) ఉన్న వారికి సి.బెళగల్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో (కేజీబీవీలో) శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇనగండ్ల డీఎస్‌టీ, మోడల్ స్కూల్, పాలకల్ బీసీ, మెయిన్, సి.బెళగల్ కొటారుమిట్ట, కోట, రెగ్యులర్, సంగాల న్యూ, కంబదహాల్ మెయిన్, కొత్తకోట రెగ్యులర్ స్కూళ్ల సీసీహెచ్‌లు మంగళవారం ఉదయం 11 గంటలల్లోపు కేజీబీవీకి చేరుకునేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏపీవీబీఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మోహన్‌రావు



ఓర్వకల్లు: ఆంధ్రప్రదేశ్ వాల్మీకీ బోయ సంఘం (ఏపీవీబీఎస్) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండలంలోని హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన బసినేని మోహన్‌రావు ఎంపికైనట్లు రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా సోమవారం మోహన్‌రావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల శ్రీనివాసరావు, రాష్ట్ర వాల్మీకీ సోదరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కర్ణాటక తరహాలో ఏపీలో కూడ బోయలను ఎస్‌టీ జాబితాలో చేర్చేందుకు తన వంతు కృషిచేస్తామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వసంతలక్ష్మి

కోడుమూరు రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సిందేనని ఎంఈఓ వసంతలక్ష్మి బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ కనకలతకు సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం హాస్టల్‌లో విద్యార్థినులకు భోజనం పెట్టడం లేదంటూ ఆదివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు హాస్టల్ ముందు ధర్నా నిర్వహించారు. దీంతో ఎంఈఓ సోమవారం హాస్టల్‌ను సందర్శించి సమస్యలపై విద్యార్థినులతో మాట్లాడారు. హాస్టల్‌లో చదువుకునే విద్యార్థినులంతా పేద కుటుంబాల నుంచి వచ్చిన వారని, వారిని చక్కగా చూసుకోవాలని వార్డెన్‌కు సూచించారు. విద్యార్థినులు కూడా బాగా చదువుకుని తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

సి.బెళగల్: మండలంలోని నాలుగు పాఠశాలల్లో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించనున్నట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. కొత్తకోట, పోలకల్, సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదే విధంగా గుండ్రేవుల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశాలకు మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 50 శాతం ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. తెలుగు, గణితం, జీవ శాస్త్రం అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందని, ఉపాధ్యాయులు తప్పక హాజరుకావాలని సూచించారు.

కడప క్రికెట్ స్టేడియం కమిటీ అధ్యక్షుడిగా కేజీ గోవింద్‌రెడ్డి

కర్నూలు (టౌన్): కడప జిల్లా క్రికెట్ స్టేడియం కమిటీ అధ్యక్షుడిగా కేజీ గోవింద్ రెడ్డి నియమితులయ్యారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా 15 సంవత్సరాలుగా ఆయన స్థానికంగా క్రికెట్ అభివృద్ధికి చేసిన సేవలకు గాను ఆంధ్ర క్రికెట్ సంఘం ఆయనను కడప జిల్లా క్రికెట్ స్టేడియం కమిటీ అధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి కె. దేవేంద్ర గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



సి.బెళగల్‌లో ముస్లింల ర్యాలీ



గార్గేయపురంలో శాంతి సందేశం ఇస్తున్న మతపెద్ద

- శాంతి ర్యాలీలు చేసిన ముస్లింలు
- ప్రవక్త శాంతి సందేశం వినిపించిన మతపెద్దలు

కోడుమూరు రూరల్: మిలాద్ ఉన్న నబీ(మహ్మద్ ప్రవక్త జయంతి) వేడుకలను కోడుమూరు నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. కోడుమూరులోని కోటవీధిలో ముస్లింలు పచ్చ జెండాలను చేతబట్టి శాంతి ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త గొప్పతనాన్ని భక్తులకు వివరించారు. ముస్లింలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని హితవుపలికారు. ప్రవక్త సూచించిన సన్మార్గంలో నడవాలన్నారు. తమకున్న దాంట్లో కొంత పేదలకు పంచి పెట్టాలన్నారు. అనంతరం కోట వీధి దర్గాలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అవాజ్ కమిటీ సభ్యులు షాకీర్ మహ్మద్, మతపెద్దలు నిస్సార్ అహ్మద్, ఖలీల్, చాంద్‌బాషా, ముల్లా నాయక్ పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం

కర్నూలు రూరల్: మండలం పరిధిలోని గార్గేయపురంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రవక్త శాంతి వ్యాఖ్యలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. మత పెద్ద సయ్యద్ సలావుద్దీన్ ప్రసంగించారు. మహ్మద్ ప్రవక్త పేరు మీదనే ఖురాన్ గ్రంథం అవతరించిందని తెలిపారు. ఖురాన్ మన జీవన విధానం ఏ విధంగా ఉండాలో తెలియజేస్తుందని చెప్పారు. ఇస్లాం అంటే శాంతికి మరో రూపమని మహ్మద్ ప్రవక్త చెప్పారని, ఆయన మార్గం అనుసరనీయమని పేర్కొన్నారు. మద్యపానం, వడ్డీ వ్యాపారాలకు దూరంగా ఉండాలన్నారు. ఇతరులకు సహాయం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఖలీల్, సయ్యద్ అహమ్మద్ బాషా, వలీయుద్దీన్, సోహెయిల్ పాల్గొన్నారు.

–సి.బెళగల్: మండల కేంద్రంలో ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించారు. మదరాసా ఆవరణలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు వీధిలోని జామియా మసీదు నుంచి చిన్నారులు జెండాలు చేతబుచ్చుకుని పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. అదే విధంగా కొత్త బస్టాండ్ దగ్గరున్న మదీనా మసీదు నుంచి ర్యాలీ నిర్వహించారు.

పాణ్యం: మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని మండలంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మండల కేంద్రంలో ఆసారే షరీఫ్ (మహమ్మద్ ప్రవక్త తలనీలాలు) ప్రదర్శించారు. అనంతరం ప్రవక్త చేసిన దైవసందేశాన్ని వివరించారు. ముక్తవలి మీర్జా ఖాదర్‌బేగ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.





కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, సి.బెళగల్ జామియా మసీద్ నుంచి ర్యాలీగా వెళ్తున్న చిన్నారులు,పాణ్యంలో మహ్మద్‌ప్రవక్త పుట్టు వెంట్రుకను చూపుతున్న దృశ్యం

క్రీస్తు మార్గం అనుసరణీయం

కల్లూరు: క్రీస్తు మార్గం అనుసరణీయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కల్లూరు అర్బన్ 41వ వార్డులోని ఎబెనేజరు బాప్టిస్ట్ చర్చి 17వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్వతమ్మ, గంగాధర్ గౌడ్, చర్చి సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిపై మట్టి.. ప్రయాణికులకు ఇబ్బంది



బ్రిడ్జిపై పేరుకుపోయిన మట్టి

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు హంద్రీ నది బ్రిడ్జిపై ఇసుక, మట్టి పేరుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బ్రిడ్జిపై నుంచి చిన్నటేకూరు నుంచి బస్తిపాడు మీదుగా కె.నాగలాపురం, కోడుమూరు, గూడూరు, మంత్రాలయం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ప్రయాణిస్తుంటారు. అలాగే గ్రామానికి చెందిన వ్యవసాయ రైతుకూలీలు వారి వాహనాలలో ఈ బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బ్రిడ్జికిపై ఇరుపక్కల ఇసుక, మట్టి పెరుకుపోయి, మొక్కలు పెరిగాయి. మట్టి ఉండడంతో పాటు ద్విచక్ర వాహనలు స్కిడ్ అయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు బ్రిడ్జిపై గడి మొక్కలు, మట్టిని తొలగించాలని కోరుతున్నారు.

మంచం పట్టిన సుగాలిమెట్ట



సుగాలిమెట్టలో మంచాన పడిన జ్వరపీడితులు



పాణ్యంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న బాధితులు

- జ్వరాలతో అల్లాడుతున్న గ్రామస్తులు
- చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు వైరల్ జ్వరాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రైవేటు ఆసుపత్రుల బాటపట్టిన బాధితులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామస్తులు జ్వరాలతో మంచం పట్టారు. వారం, పది రోజల నుంచి గ్రామంలో ఎక్కడ చూసినా చిన్న పిల్ల నుంచి వృద్ధుల వరకు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో అల్లాడిపోతున్నారు. ప్రతి వీధిలోనూ జ్వరపీడితులే అధికంగా ఉన్నారు. ఆదివారం ఈ జ్వరాలు మరింత అధికం కావడంతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల బాట పట్టారు. పాణ్యం, నంద్యాల తదితర పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రులో చికిత్స చేయించుకుంటున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చిన ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు. చేసేదేమీ లేక వేలకు వేలు ఖర్చు చేసి ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్ల నుంచి వృద్ధుల వరకు జ్వరాలతో మంచంపట్టారు.

కందనవోలు వరప్రదాయిని ఆరేపల్లి వరలక్ష్మమ్మ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య సాయిగోపాల్, సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: కందనవోలు వరప్రదాయిని ఆరేపల్లి వరలక్ష్మమ్మ అని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డి.వి.ఆర్.సాయిగోపాల్ అన్నారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పింగళి సూరన తెలుగు తోటలో ప్రముఖ కవయిత్రి ఆరేపల్లి వరలక్ష్మమ్మ రచించిన శ్రీమద్దేవీ భాగవతం–1,2, రాజశేఖర చరిత్ర, దశకుమార చరిత్రము, పారిజాతాపహరణం పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డి.వి.ఆర్.సాయిగోపాల్ సాహితీ వేత్తలు కురాడి చంద్రశేఖర కల్కూర, జేఎస్ఆర్కే శర్మ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎనిమిదో తరగతి వరకే చదువుకొని దాదాపు పాతిక పుస్తకాలను వెలువరించిన ఘనత వరలక్ష్మమ్మకే దక్కుతుందన్నారు. కవులు, రచయితలు డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, డాక్టర్ బోలుగద్దె అనిల్ కుమార్, డాక్టర్ తొగట సురేష్‌బాబు పుస్తకాలను సమీక్షించారు. అనంతరం కవయిత్రి వర లక్ష్మమ్మను ఘనంగా సన్మానించారు. నరసం అధ్యక్షురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, సభ్యులు కర్నాటి చంద్రమౌళిని, హైమావతి, పసుపులేటి నీలిమ, రజనీ కల్కూర, లక్ష్మీ సుశీల రాణి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములవుదాం



పి.వి.రామలింగేశ్వర్, నగరపాలక కమిషనర్

కర్నూలు (టౌన్) : ఈనెల 17 నుంచి వచ్చే నెల 1 వ తేదీ వరకు నగరంలో నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరం భాగస్వాములవుదామని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు నగర పాలక అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులతో కలిసి కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన దేశం– సురక్షిత ప్రజారోగ్యం కోసం చేపట్టే ఈ ర్యాలీకి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నేటి నుంచి అక్టోబర్ 1 వ తేదీ వరకు రోజుకొక కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, బహిరంగ స్థలాల్లో మొక్కలు నాటడం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పారిశుద్ధ్యంపై అవగాహన, తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యానవనాలు, పర్యాటక కేంద్రాల సుందరీకరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అక్టోబర్ 2 వ తేదీ నగరపాలక కౌన్సిల్ హాలులో స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమం నిర్వహిస్తామని సోమవారం ఓ ప్రకటనలో కమిషనర్ వెల్లడించారు.

నేటి నుంచి స్వచ్ఛతాహీ సేవ

సి.బెళగల్: మండల పరిధిలో మంగళవారం నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి డ్రైవర్ మృతి

కర్నూలు: గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్‌పై విగ్రహాన్ని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు డ్రైవర్ కింద పడి మృతి చెందాడు. పాతబస్తీ బండిమెట్టలోని అలిసేర్‌భాగ్ వీధికి చెందిన గద్ద పోగు కృష్ణ (49) ఆటో తోలుతూ జీవనం సాగించేవాడు. ఆదివారం రాత్రి పూలబజార్ ఆటో స్టాండ్ దగ్గర ఉన్న విగ్రహాన్ని నిమజ్జనం నిమిత్తం తరలిస్తుండగా కొండారెడ్డి బురుజు దగ్గర ప్రమదవశాత్తు ట్రాక్టర్ టైర్ కింద పడ్డారు.

టైలర్ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు




ఉస్మాన్‌గనికి స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కోడుమూరు రూరల్: కోడుమూరులో టైలర్‌గా పనిచేస్తున్న మహబూబ్ బాషా, అమీనాబి దంపతుల చిన్న కుమారుడు ఉస్మాన్ గని ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఆదివారం వెలువడిన నీట్ ఫలితాల్లో ఉస్మాన్‌గని 644మార్కులు సాధించడంతో ఆల్ ఇండియా ర్యాంకు 31713, స్టేట్ ర్యాంకు 699 వచ్చింది. తమ కుమారుడికి వైద్య సీటు రావడంతో తల్లిదండ్రులు ఉప్పొంగిపోయారు. ఉస్మాన్ గని ఇంటర్ వరకు నవోదయ పాఠశాలలో విద్యనభ్యసించి డాక్టర్ సీటు కోసం ఇంటి వద్దనే ప్రిపేర్ అయ్యాడు. మొదటి సారి సీటు రాలేదు. విజయవాడలో కోచింగ్ తీసుకుని రెండోసారి విజయం సాధించాడు. కాగా బాషా పెద్ద కుమార్తె టీచర్‌గా పనిచేస్తోంది. రెండో కుమార్తె డీఎస్సీకి సిద్ధమవుతోంది. పెద్ద కుమారుడు గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయి మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతుండడం గమనార్హం. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువులో రాణిస్తున్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు.. తగ్గిన ఆదాయం

- పాణ్యం పరిధిలో పలు గ్రామాల్లో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
- 48 శాతం తగ్గిన రెవెన్యూ
- సర్వే నంబర్ స్థానంలో ఎల్‌పీఎం నంబర్లతో సమస్యలు
- లబోదిబోమంటున్న రైతులు, విక్రయదారులు



పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

పాణ్యం : ప్రభుత్వానికి అత్యధికంగా రెవెన్యూ అందించే రిజిస్ట్రార్ కార్యాలయంలో కొన్ని నెలల నుంచి రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో అమాంతగా ఆదాయం పడిపోయింది. నిర్ణీత లక్ష్యం అంటుంచితే కనీస రెవెన్యూ కూడా రావడం లేదు. నిత్యం కళకళలాడాల్సిన కార్యాలయం నేడు రిజిస్ట్రేషన్లు కాక వెలవెలబోతోంది. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా కేవలం ఏడు గ్రామాలకు చెందిన రిజిస్ట్రేషన్లు మాత్రమే అవుతుండటంతో భూ క్రయ, విక్రయదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఏడు గ్రామాల్లోనే రిజిస్ట్రేషన్లు..

పాణ్యం సబ్ రిజిస్ట్రార్ పరిధిలో పాణ్యం మండలంలోని 18 గ్రామాలు, నంద్యాల మండలంలోని బ్రహ్మణపల్లె, పొలూరు, బనగానపల్లె మండలం పరిధిలో రామతీర్థం, నందివర్గం, బిరవోలు, గడివేముల పరిధిలోని దుర్వేశి గ్రామాలు ఉన్నాయి. అయితే కేవలం ఏడు గ్రామాలకు సంబంధించిన భూములు మాత్రమే రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. వీటిలో పాణ్యం, భూపనపాడు, నందివర్గం, రామతీర్థం, గగ్గటూరు, తమ్మరాజుపల్లె , కొలురు, చిలకల గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి రోజు నాలుగు డాక్యుమెంట్ల కంటే ఎక్కువగా కావడం లేదని అధికారులు చెబుతున్నారు. మిగిలిన గ్రామాల్లో ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సల్ మెంబర్) కారణంగా రిజిస్ట్రేషన్ కావడం లేదని అంటున్నారు. రీ సర్వేలో భాగంగా సర్వే నంబర్‌కు బదులు ఎల్‌పీఎం నంబర్లు కేటాయించయడంతో సమస్య తలెత్తుతున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోవడం పోవడం గమనార్హం.

తగ్గిన రెవెన్యూ...

పాణ్యం సబ్ రిజిస్ట్రార్ పరిధిలో నాలుగు నెలల నుంచి ఆదాయం భారీగా తగ్గింది. నిర్ణయించిన రెవెన్యూ కంటే 48 శాతం మైనస్‌కు పడిపోయింది. ఇందుకు కారణంగా సకాలంలో రిజిస్ట్రేషన్లు కాకపోవడమే. ఇప్పటికే భూ క్రయ, విక్రేయదారుల, దాన విక్రేయదారులు, ఇళ్ల రిస్ట్రేషన్, ఇతర రిజిస్ట్రేన్లు కాకా ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం సమస్యలను త్వరగా పరిష్కారించి రిజిస్ట్రేషన్లు అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

పలు గ్రామాలకు సంబంధించిన ఆస్తులు రిజిస్ట్రేషన్ కావడం లేదనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రిజిస్ట్రేషన్ కాని గ్రామాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేని గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు అవుతున్న గ్రామాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం.

– చెన్నకేశవరెడ్డి, డీఆర్‌ఓ, నంద్యాల

భక్తిశ్రద్ధలతో సంజమ్మవ్వ ఆరాధనోత్సవం



సంజమ్మ చిత్రపటానికి పూజలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో అవధూత సంజమ్మ అవ్వ ఆరాధానోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అవధూత ఆదోని లక్ష్మమ్మ అవ్వ శిష్యురాలుగా పేరుగాంచిన సంజమ్మ అవ్వ వర్ధంతి సందర్భంగా పూజారి రామకృష్ణుడు అవ్వ సమాధికి ప్రత్యేక పూజలు చేశారు. అవ్వ చిత్రపటానికి భక్తులు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నన్నూరు, పూడిచెర్ల, బైరాపురం, లొద్దిపలె గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.